క్లుప్తంగా

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘనంగా నివాళులు



ఠాగూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్, విద్యార్థులు

గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి గురువారం నిర్వహించారు. లైబ్రేరియన్ ఎన్.మధుసూదనరావు, పాఠకులంతా కలిసి ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సాహిత్యం ద్వారా భారతదేశ కీర్తిని ప్రపంచ నలుమూలలకు చాటిన విధానాన్ని వక్తలు కొనియాడారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీపీఎం శ్రావణకుమార్‌నాయుడు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జట్టు ఆశ్రమంలో సమాచార హక్కు చట్టంపై గురువారం అవగాహన కల్పించారు. చట్టం వల్ల కలిగే ప్రయోజనాలను డీపీఎం ఎం.శ్రావణకుమార్‌నాయుడు వివరించారు. ఈ చట్టం ద్వారా అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన సమాచారం పొందే అవకాశం ఉందన్నారు. వ్యవస్థల పనితీరు పట్ల ప్రజలకు జవాబుదారీతనం కలిగించేందుకు ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగులో నెల వారీ చేయాల్సిన పనులను తెలిపారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు



ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

పాలకొండ రూరల్: ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమష్టి కృషి అవసరమని పాలకొండ డిప్యూటీ ఈవో పత్రి కృష్ణమూర్తి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల వేదికగా గురువారం ఈ అంశంపై డివిజన్ స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులచే ప్రాజెక్టులు సిద్ధం చేయించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు, బాల శాస్త్రవేత్తలను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణలో అందించిన అంశాలపై అవగాహన పెంచుకుని విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. సెప్టెంబర్ 15వ వరకూ ప్రాజెక్టుల నామినేషన్‌కు అవకాశం ఉందన్నారు. ఈ మేరకు జాతీయ స్థాయిలో స్థానం సాధించే విధంగా విద్యార్థులకు వెన్నుతట్టి ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో వేదిక పాఠశాల హెచ్‌ఎం నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

గరుగుబిల్లి: విద్యార్థులు, యువత అంతా మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, వాటికి అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు అన్నారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై గురువారం అవగాహన కల్పించారు. గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై ఎంతోమంది తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలన్నీ మెదడు, గుండె, కిడ్నీలు, లివర్ వంటి ముఖ్య అవయాలపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రజని తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో వర్షం



పట్టణంలో జోరుగా కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: కొద్ది రోజులుగా మండే ఎండలు.. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. మరోవైపు రైతులు కూడా సంతోషించారు. ఇటీవల మండే ఎండలతో వరి నారు మడులు చాలా వరకు ఎండిపోతున్నాయి. ఈ దశలో కురిసిన వర్షంతో నీరు పొలాల్లో చేరి అనుకూలంగా మారింది. పాలకొండలోని కోమటిపేట, కొత్తవీధి, రావాడ వీది, గాసీ వీధి, కస్పా వీధుల్లో నీరు రోడ్లపై ప్రవహించింది.

పిచికారీలో నిర్లక్ష్యం వద్దు..

- మందులు స్ప్రే చేసే వ్యక్తి రక్షణ చర్యలు తీసుకోవాలి
- లేకుంటే ప్రాణాలకే ముప్పు



పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతు

గుమ్మలక్ష్మీపురం: రైతులు సాగు చేస్తున్న పంటల్లో చీడపీడల నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుతం రసాయనిక పురుగు మందుల వాడకం తప్పనిసరి అయిపోయింది. ఈ పరిస్థితుల్లో పిచికారీ చేసే వ్యక్తి సరైన జాగ్రత్తలు పాటించకపోతే ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. పలు సందర్భాల్లో స్ప్రే చేసే వ్యక్తికి ఆరోగ్యం వికటించి ఆసుపత్రి పాలైన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆదమరిస్తే ప్రాణనష్టం కూడా జరిగే ప్రమాదం ఉంది. మందుల పిచికారీలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందేనని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

పిచికారీ ముందు..

మందు పిచికారీకి పరిశుభ్రమైన నీటినే వాడడంతో పాటు చేతులు, కళ్లు, ముక్కు, నోరు, చెవులకు ప్రత్యేక రక్షణ తీసుకోవాలి. తలకు టోపీతో పాటు ముఖం మొత్తం కప్పేటట్టు చూసుకోవాలి. పురుగు మందుల వెంబడి వచ్చిన కవర్లను వినియోగించకూడదు. ద్రావకాన్ని కలిపే ముందు డబ్బాపై ఉన్న లేబిల్‌ను గమనించి దాని ప్రకారం అవసరానికనుగుణంగా కలుపుకోవాలి. మందు కలిపేటప్పుడు కచ్చితంగా కళ్లజోడు ఉంచుకోవాలి. లేని పక్షంలో కలిపేటప్పుడు కళ్లల్లోకి తుల్లకుండా జాగ్రత్తపడాలి. ద్రావకాన్ని పంపులో పోసేటప్పుడు, పిచికారీ చేసేటప్పుడు బీడి, సిగరెట్, ఖైనీ వంటివి వేసుకోకూడదు. మందును ముక్కుతో వాసన చూడకూడదు. పిచికారీ తర్వాత భోజనం చేసేటప్పుడు సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి.

పిచికారీ చేసే విధానం..

పిచికారీ చేసే డబ్బా సరైనది ఎంచుకోవాలి. డబ్బా లోపలి నుంచి లీక్ కాకుండా చూసుకోవాలి. సరైన నాజిల్ ఎంచుకోవాలి. పిచికారీ సమయంలో నాజిల్‌లో ఏదైనా అడ్డుపడితే నోటితో ఊదకూడదు. గాలి ఎక్కువగా వీచేటప్పుడు, ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు పిచికారీ ప్రయత్నాలు మానుకోవాలి. పిచికారీ సమయంలో గాలి వస్తున్నట్లయితే గాలికి వ్యతిరేకంగా పిచికారీ చేయకుండా గాలి వాలుకు చేసుకోవాలి. మందులు కలిపిన డబ్బాలలో నీరు పట్టుకొని తాగడం వంటివి చేయకుండా ఉండాలి.

డబ్బాలను జాగ్రత్తగా..

పిచికారీ పూర్తయిన తర్వాత మందు డబ్బాలను విచ్చలవిడిగా పడేయకూడదు. డబ్బాలను కడిగి కాలువలు, నీటి కుంటలలో పోయకూడదు. అవసరానికనుగుణంగా మాత్రమే మందు కలుపుకోవాలి. మందు మిగిలిన డబ్బాలను నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచుకునే ఏర్పాటు చేసుకోవాలి. చిన్న పిల్లలకు, పశువులకు దగ్గరగా మందు డబ్బాలు ఉంచకూడదు. ఆకు కూరలకు మందు పిచికారీ చేసిన వెంటనే కోయకూడదు. కనీసం మూడు రోజుల తర్వాత కోయాలి.

తస్మాత్...

పంటల సాగులో మందులు స్ప్రే చేసేటప్పుడు కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలి. లేకుంటే ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదం సంభవించే అవకాశం ఉంటుంది. మందు పిచికారీ ముందు.. తరువాత కూడా పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలి.

– పి.శంకరరావు, ఏవో

ఒకేచోట వంట ఆలోచన విరమించుకోవాలి



ఆందోళన వ్యక్తం చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

గరుగుబిల్లి: మండలంలో ఒకేచోట మధ్యాహ్న భోజనం వంటలు వండి అన్ని పాఠశాలలకు పంపిణీ చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని మధ్యాహ్న భోజనం నిర్వాహకులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం సమావేశమై, తమ డిమాండ్లపై నినదించారు. వారి తరఫున సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ మాట్లాడుతూ ఒకే దగ్గర వంటలు చేస్తే ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న వారేం కావాలని ప్రశ్నించారు. ఇప్పటికే రూ.3 వేలు చెల్లించి శ్రమదోపిడీ చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఇప్పుడు వారికి ఉపాధి లేకుండా ఒకే దగ్గర వంటశాల పెట్టి వంటకాలు చేసేందుకు సిద్ధమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఈ విధానాన్ని నిరసిస్తూ ఈ నెల 10వ తేదీన పార్వతీపురంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు పావని, అన్నపూర్ణ, మణికుమారి, సీఐటీయూ నాయకులు డి.వెంకటనాయుడు, కె.జగ్గారావు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులు వెంటనే పరిష్కరించండి

వీరఘట్టం: మండల వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన వినతులు వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ కామేశ్వరరావు సూచించారు. స్థానిక కార్యాలయంలో వీఆర్‌వోలు, విలేజ్ సర్వేయర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ముటేషన్లు, ఓబీసీ ధ్రువపత్రాలు, పొజిషన్ సరిఫికెట్లను త్వరగా మంజూరు చేసేందుకు చొరవ చూపాలన్నారు. సర్వే సిబ్బంది కూడా భూ సమస్యలపై వచ్చే వినతులను నిశితంగా పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కె.కవిత, మండల సర్వేయర్ ఎస్.రమణమూర్తి, సర్వే డీటీ జి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై గ్రామసభ



పెద్దూరు గ్రామసభలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ పున్నపునాయుడు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో జవాబుదారీతనం మరింత పెంచేందుకు సామాజిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్ఆర్‌పీ ఇ.పున్నపునాయుడు అన్నారు. మండలంలోని పెద్దూరులో ఉపాధి పనుల సామాజిక తనిఖీలపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన..ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు నిర్వహించిన ఉపాధి పనుల సామాజిక తనిఖీలను నిర్ణయ యాప్ ద్వారా చేపట్టడం జరిగిందన్నారు. మండలంలో ప్రస్తుతం చేపడుతున్న 19వ విడత సామాజిక తనిఖీలలో రూ.20.07 కోట్లకు సంబంధించిన పనులను తనిఖీలు చేయడం జరిగిందన్నారు. సామాజిక పింఛన్లను తనిఖీ చేశామని, ఈ నెల 22న మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అప్పారావు, ఎఫ్ఏ చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

12న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



నులి పురుగుల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

వీరఘట్టం: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం ఈ నెల 12న జరగనున్న నేపథ్యంలో విజయవంతం చేయాలని ఎంపీడీవో బి.వెంకటరమణ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆయన గురువారం ఆవిష్కరించారు. మండలంలో 91 అంగన్‌వాడీ కేంద్రాలు, 74 ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుతున్న చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. ఎంఈవో ఆర్.ఆనందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శక్తి యాప్ వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కురుపాం ఏఎస్ఐ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మహిళలకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన శక్తి యాప్ వినియోగంపై మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అవగాహన కల్పించారు. కురుపాం ఏఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు ఈ యాప్‌లోని ఎస్ఓఎస్ ఆప్షన్‌ను ఉపయోగిస్తే క్షణాల్లో పోలీసులు మీ వద్దకు వచ్చి రక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు. అలాగే పోక్సో, ఈవ్‌టీజింగ్ చట్టాలు–శిక్షలను తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



తుమరాడ అంగనవాడీ కేంద్రంలో రికార్డుల పరిశీలన

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు బి.కాంతారావు గురువారం సందర్శించారు. మండలంలోని తుమరాడ, స్థానిక బల్లంకి వీధి అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన గురువారం సందర్శించారు. అందిస్తున్న ఆహారం, మెనూ, స్టాక్ రిజిస్టర్, ఆహార పదార్థాల నాణ్యతపై ఆరా తీశారు. పిల్లల ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సీడీపీవో జి.సుగుణకుమారి, సూపర్‌వైజర్ పి.దశారత్నం తదితరులు ఉన్నారు.

ఆహార కల్తీ చేపడితే చర్యలు



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న కాంతారావు

పాలకొండ:

ఆహార కల్తీలకు పాల్పడితే చర్యలు తప్పవని రాష్ట్ర ఆహార సలహా కమిషన్ సభ్యులు కాంతారావు అన్నారు. గురువారం పట్టణంలోని పలు పాఠశాలలు , రేషన్ డిపోలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆహార తనిఖీలు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. రేషన్ షాపులతో పాటు వసతిగృహాలు, మధ్యాహ్న భోజన పథకం, హోటల్స్ తదితర ఆహార విక్రయ కేంద్రాలను పరిశీలిస్తున్నామన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సూచనలు చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించి నిర్వహణ పనులు శనివారం చేపట్టనున్నట్లు ఆ శాఖ ఈఈ కె.విష్ణుమూర్తి గురువారం తెలిపారు. ఈ క్రమంలో సదరు సబ్‌స్టేషన్ పరిధిలో వీరఘట్టం మండలం తెట్టంగి, తలవరం, బిటువాడ, పాలకొండ మండలం ఎంసింగిపురం, తమరాడ తదితర గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

రేషన్ డిపోల్లో తూనికలు కచ్చితంగా ఉండాలి



రేషన్ డిపో వద్ద తనిఖీలు చేస్తున్న స్టేట్ ఫుడ్ కమిటీ కమిషన్ మెంబర్

వీరఘట్టం: రేషన్ డిపోల్లో తూనికలు కచ్చితంగా ఉండాలని స్టేట్ ఫుడ్ కమిటీ కమిషన్ మెంబర్ బి.కాంతారావు సూచించారు. గురువారం ఆయన వీరఘట్టంలో మూడు రేషన్ డిపోలు తనిఖీలు చేశారు. ప్రతీ నెలా వారికి వస్తున్న బియ్యం, ఇంత వరకు కార్డుదారులకు పంపిణీ చేసిన బియ్యం, ధరల పట్టిక వివరాలు, తూనికల కాటాను పరిశీలించారు. రేషన్ డిపోలను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంచాలన్నారు. రికార్డులన్నీ పక్కాగా ఉండాలని డీలర్లకు సూచించారు. ఆయనతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా పౌర సరఫరాల శాఖ డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు, వీరఘట్టం డీటీ జి.ప్రసాదరావు, ఆర్.ఐ రవితేజ తదితరులున్నారు.

కూటమిలో ఓటమి భయం

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనతికాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, ఈ నేపథ్యంలో ఓటమి భయం వారిని వెంటాడుతుందని, ఈ అక్కసుతో ప్రతిపక్ష ప్రజా ప్రతినిధులు, నాయకులపై పాశవిక దాడులకు తెగబడుతున్నారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా క్షేత్రంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలే... రెడ్‌బుక్ పాలనను వారు గమనిస్తున్నారని స్పష్టం చేశారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ సీపీకి చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, నాయకులు వేల్పుల రామలింగారెడ్డితో పాటు అక్కడి కార్యకర్తలపై కూటమి మూకలు చేసిన హత్యాయత్నం, ప్రణాళికబద్ధమైన దాడిని విక్రాంత్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తక్షణమే జోక్యం చేసుకోవాలన్నారు. ఆయన వెంట నియోజకవర్గ పార్టీ నాయకులు ఉన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



పట్టుబడిన సారాతో ఎక్సైజ్ శాఖ అధికారులు

వీరఘట్టం: స్థానిక రెల్లివీధి, బీసీ కాలనీ, కొండవీధుల్లో గురువారం ఎక్సైజ్ శాఖ కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ దాడుల్లో బండి కమలాకర్ వద్ద 5 లీటర్ల సారా, అరసాడ గౌరమ్మ వద్ద 20 లీటర్ల సారా, గురుబిల్లి గౌరమ్మ వద్ద 80 లీటర్ల సారా పట్టుబడినట్టు పాలకొండ ఎక్సైజ్ శాఖ సీఐ సూర్యకుమారి తెలిపారు. మొత్తం 105 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడుల్లో పార్వతీపురం, పాలకొండ, విజయనగరానికి చెందిన 20 మంది అధికారులు పాల్గొన్నట్టు సీఐ తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి



నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో రమేష్ తదితరులు

కొమరాడ: ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్న వారంతా నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని ఎంపీడీవో ఎస్.రమేష్ తెలిపారు. ఈ నెల 12న నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని, మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ, వెలుగు శాఖల అధికారులతో ఆయన గురువారం సమావేశమై నులిపురుగుల నివారణ దినోత్సవం, ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు తప్పనిసరిగా నులిపురుగు నివారణ మాత్రలు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శిరీష, శామ్యూల్, వెలుగు ఏపీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్(జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శ్రీవరం పాల్గొని కాసేపు మాట్లాడారు. చేనేత వస్త్రాలను ధరించి, చేనేత కార్మికులకు అండగా నిలవాలని, వారంలో ఒక్కరోజైనా చేనేత దుస్తులు ధరించేలా చూడాలని కోరారు. అనంతరం చేనేత దుస్తుల ధారణను ప్రోత్సహిస్తూ చేపట్టిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

నేరేడువలసలో కార్డెన్ సెర్చ్



ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని నేరేడువలస గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ గురువారం చేశారు. గ్రామంలోని ప్రతి దుకాణానికి వెళ్లి గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలు ఏవైనా అమ్ముతున్నారా లేదా అనేది పరిశీలించారు. అలాగే గ్రామంలోకి కొత్త వ్యక్తుల రాకపోకలపై సమాచారం సేకరించారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారం ఎక్కడైనా ఉంటే తమకు తెలియజేయాలని ఎస్ఐ పి.నారాయణరావు కోరారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్

సీతంపేట: నాటు తుపాకులు పట్టుకోవడానికి పోలీసులు గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. శిలిగాం గ్రామంలో ఎస్ఐ వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో విస్తృతంగా నాటు తుపాకులు కోసం గాలించారు. ఎటువంటి లైసెన్సు లేని నాటు తుపాకులు కలిగి ఉన్నా, వినియోగించినా చట్టరీత్యా నేరమన్నారు. ఎవరివద్దనైనా నాటు తుపాకులు ఉంటే వెంటనే స్వచ్ఛందంగా స్టేషన్‌కు అప్పగించాలన్నారు. దానిని ఉపయోగించి వేటకు వెళ్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.



శిలిగాంలో నాటు తుపాకుల కోసం గాలిస్తున్న ఎస్ఐ తదితరులు

సూపర్ సిక్స్ కాదు... కూటమి ప్రభుత్వం డక్ ఔట్

- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి



కడకెల్లలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: గత ఎన్నికల ముందు అమలు కానీ హామీలతో సూపర్ సిక్స్ అంటూ కూటమి నాయకులు ప్రజలను మోసగించారని, అది సూపర్ సిక్స్ కాదని, కూటమి ప్రభుత్వం డక్ ఔట్ అయ్యిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వీరఘట్టం మండలంలోని నడిమికెల్ల, విక్రమపురం, కడకెల్ల గ్రామాల్లో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. సూపర్ సిక్స్ అంటూ బూటకపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా కూడా ఇవ్వలేకపోవడం సిగ్గుచేటన్నారు. ఆర్.ఎస్.కేలకు వస్తున్న అరకొర యూరియాను కూటమి నాయకులు అడ్డగోలుగా తీసుకువెళుతున్నారని, గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు యూరియా అందనీయకుండా అడ్డుకోవడం పద్ధతి కాదన్నారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్‌లను ప్రజలకు చూపించి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైఎస్సార్‌సీపీ నాయకులు తెర్లి దాలినాయుడు, మద్రాపు ఉమా, గౌరీశంకరరావు, డోకల శ్రీను, మాచర్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.